# పెన్ పవర్

10 YEAR ANNIVERSARY 2014 - 2024

తెలంగాణ రౌండప్

శనివారం | 1 ఫిబ్రవరి 2025 | పేజీలు 8


మిథిలా నగర్‌లో 307 కబ్జాలను పరిశీలిస్తున్న మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్..




# మిథిలానగర్ 307 కబ్జాలను...
# సందర్శించిన ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్

- కుత్బుల్లాపూర్ గాజులరామారం సర్వే నెంబర్ 307 ప్రభుత్వ భూమిలో కబ్జాల పర్వం..
- ప్రగతినగర్ పక్కన ఉన్న మిథిలా నగర్‌లో ఏడాదిగా అక్రమ కట్టడాలు..
- కోర్టు ఆర్డర్ పేరుతో రెచ్చిపోతున్న కబ్జాదారుడు.. కౌంటర్ దాఖలు చేసినా ఫలితం శూన్యం..
- రెవెన్యూ "స్టే వెకెట్" జాప్యంతో.. యధేచ్ఛగా నిరంతర కబ్జాలు..
- కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులతో శుక్రవారం ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్ పరిశీలన..
- ఒకే కోర్టు ఆర్డర్‌ను పలుచోట్ల ఉపయోగిస్తూ..! సుమారు 50 ఫీట్ల ఎత్తులో అక్రమ డంపింగ్‌లు..
- ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలకు.. విద్యుత్ స్తంభాలు, కరెంటు మీటర్లు..
- కొత్తగా మరికొన్ని బేస్మెంట్‌లు గుర్తించిన ఆర్డీవో, వెంటనే కూల్చివేయాలని తహశీల్దార్‌కి ఆదేశం..

## ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టి డంపింగ్‌లు, అక్రమ నిర్మాణాలను ఆర్డీవో పరిశీలించారు..




గాజులరామారం ప్రభుత్వ భూముల కబ్జాలకు, ఎప్పటికప్పుడు అంతంకాదు ఆరంభం అన్నట్లుగా తయారైంది.. గతంలో ఫోలీసు భద్రతా బలగాలతో కూల్చివేతలు చేపట్టినా కబ్జాదారుల్లో మార్పు కనిపించడం లేదు.. పీడీయాక్ట్ కేసులు నమోదు చేసినా, ఏమి చేయలేక పోతున్నారని స్పష్టమవుతుంది.. కబ్జాదారులను అరికట్టాలంటే విద్యుత్ మీటర్లు నిలిపివేయాలి.. కానీ ఒక్కో మీటర్‌కు రూ.30 వేలు పుచ్చుకుని, ప్రభుత్వ భూమిలో విద్యుత్ శాఖ మీటర్లు, లక్షలు తీసుకుని కరెంటు స్తంభాలు సాంక్షన్ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహశీల్దార్, ఎలక్ట్రిసిటీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం శూన్యం.. మరోవైపు కబ్జాదారులు రెండు రోజుల్లో కోర్టు ఆర్డర్‌లు తెచ్చుకుంటున్నారు.. కానీ రెవెన్యూ అధికారులు రెండు సంవత్సరాలు గడిచినా స్టే వెకెట్ చేయించలేక పోవడం గమనార్హం.. సర్వే నెంబర్ 307 ప్రభుత్వ భూమి మిథిలా నగర్ కబ్జాలకు కబ్జాదారుడు ఇదే ఫార్ములాను వాడు కుంటున్నారు.. **మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 31:**







మిథిలా నగర్‌లో 307 కబ్జాలు..

-2లో

# ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ కేసులను..
# తక్షణమే పరిష్కరించాలి..

## ఎస్సీ,ఎస్టీ కమీషన్ ఛైర్మన్ వెంకటయ్య..

- మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం..
- ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి తక్షణమే పరిష్కరించి న్యాయం చేయాలి..
- కేసులు నమోదైన వెంటనే విచారణ దశలోనే బాధితులకు నష్టపరిహారం అందించాలి..



-3 లో

# గద్దర్ ఆలోచనలు
# యువతకు స్ఫూర్తి దాయకం

హైదరాబాద్ పెన్ పవర్:గద్దర్ తెలంగాణలో పుట్టడం అందరి అదృష్టమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గద్దర్ ఆలోచనలు ప్రపంచవ్యాప్తంగా వ్యాపించాయన్న భట్టి.... ఆయన ఆలోచనలు ఎంతోమందికి స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజాకవి గద్దర్ జయంతి.. వర్ధంతి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. ఒక పాట తో, ఒక మాట తో లక్షల మందిని

-4 లో



# మిథిలానగర్ 307 కబ్జాలను.. సందర్శించిన ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్..







## 50 శాతం విద్యుత్ అధికారుల ప్రోత్సాహమే..

మిథిలా నగర్ వైపు ఉన్న సర్వే నెంబర్ 307 ప్రభుత్వ భూమి కబ్జాలకు విద్యుత్ అధికారుల ప్రోత్సాహం కీలంగా మారింది.. చట్టంలోని లొసుగులతో, విద్యుత్ అధికారులు స్తంభాలు, కరెంటు మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు సాంక్షన్ చేయడం, కబ్జాదారులకు కీలక ఆధారలుగా నిలుస్తున్నాయి.. రెవెన్యూ అధికారులు కూడా ఆకోణంలో ఆలోచించకుండా, సందర్శనలు, పరిశీలనల పేరుతో చర్యలకు కాలయాపన చేస్తున్నారు.. గతంలో 329, 342, 307 ప్రభుత్వ భూముల్లోనూ విద్యుత్ శాఖ కరెంటు స్తంభాలు, మీటర్లు ఇస్తున్నారని పెన్ పవర్ దినపత్రికలో పలుమార్లు వార్తా కథనాలతో, డివిజనల్ ఇంజనీర్(డిఈ) గాజులరామారం అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఎడిఈ) ఏఈ దృష్టికి తీసుకెళ్ళినా కుక్కతోక వంకర వంకరే అన్న చందంగా యధావిధిగా విద్యుత్ అధికారులు తమ వక్రబుద్ధితో మీటర్లు సాంక్షన్ చేస్తున్నారు.. మిథిలా నగర్ ఏఈ దృష్టికి తీసుకెళ్ళినా కబ్జాదారులకు కరెంటు స్తంభాలు, మీటర్లు సాంక్షన్ చేస్తున్నారు.. సదరు కబ్జాదారుడు రెవెన్యూ అధికారులకు, విద్యుత్ అధికారులకి ప్లాట్‌లను ఇచ్చినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.. అందుకే కోర్టు ఆర్డర్ నెపంతో రెవెన్యూ సహకరించడం..! వక్రమార్గంలో విద్యుత్ అధికారులు కరెంటు సౌకర్యం కల్పిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి..

**రెవెన్యూ అధికారుల్లో పారదర్శకత మచ్చుకు కూడా కనిపించడం లేదు.. విద్యుత్ అధికారులకు హద్దూఅదుపు లేకుండా పోయింది.. కబ్జాకు గురయ్యే ప్రభుత్వ భూమి ఎంత విలువైందో చూడటం లేరు..! తమకు ఎంత వస్తుందో అనేదే చూస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.. గాజులరామారం సర్వే నెం.307, 329, 342 ప్రభుత్వ భూముల కబ్జాల్లో "రెవెన్యూ-విద్యుత్" అధికారుల భాగస్వామ్యం సమపాళ్ళలో ఉన్నట్లు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ గుర్తిస్తే..! కబ్జాలని నియంత్రించడానికి సులువుగా ఉంటుంది.. శుక్రవారం కబ్జాలను పరిశీలించిన ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్, విద్యుత్ అధికారులు మంజూరు చేసిన, కరెంటు మీటర్లు తక్షణమే తొలగించడానికి చర్యలు చేపడితే కబ్జాల బెడద 80 శాతం తగ్గుతుంది.. ఏదిఏమైనప్పటికీ కబ్జాలకు ప్రధాన కారణంగా నిలుస్తున్న కోర్టు ఆర్డర్‌లను కాలయాపన చేయకుండా ఎప్పటికప్పుడు కౌంటర్ దాఖలు చేసి వెకెట్ చేయిస్తే భూములను కాపాడవచ్చు.**

-

**మొదటి పేజి తరువాయి**

మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం సర్వే నెంబర్ 307 స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థకు కేటాయించారు.. దీంతో పాటు సర్వే నెంబర్ 329, 342, ప్రభుత్వ భూములు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భాగానే ఉన్నప్పటికీ..! ప్రత్యేక తెలంగాణ ఆవిర్భావం అనంతరం 2018 నుండి గత ప్రభుత్వ హయాలో నేతల అనుచరులే కబ్జాదారులుగా రంగంలోకి దిగారని విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే.. కబ్జాదారులు పేదలను టార్గెట్ చేసి ప్రభుత్వ భూములను కట్టబెట్టడం..! గతంలో కొందరు రెవెన్యూ అధికారులకు ఒక్కో నిర్మాణానికి రూ.3 లక్షలు చెల్లించి రేయింబవళ్ళు అక్రమ కట్టడాలతో కబ్జాల జాతరపై పలు పత్రికల్లో వచ్చిన కథనాలకు..! స్పందించి కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లు, ఆర్డీవోలు అప్పట్లో సందర్శించిన విషయం తెలిసిందే.. ఈ వ్యవహారంలో కలెక్టర్ విచారణ జరిపి కుత్బుల్లాపూర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్,సహా ముగ్గురు విఆర్ఏలను సస్పెండ్ చేశారు.. అయినా పలుకుబడి ఉన్న ఆర్ఐ ఆరునెల్లు తిరగక ముందే ఆర్డీవో కార్యాలయంలో యధావిధిగా విధుల్లో చేరడం గమనార్హం.. అధికారులే ఇలా ఉంటే కబ్జాదారులను కట్టడి చేయగలరా..? ప్రస్తుతం గాజులరామారం సర్వే నెంబర్ 307 మిథిలా నగర్‌తో పాటు, బాలయ్య భస్తీ, గాలి పోచమ్మ బస్తీలో అక్రమ నిర్మాణాలు చేపడుతుండగా..! సర్వే నెంబర్ 329, 342, ప్రభుత్వ భూముల్లోనూ భూ కబ్జాలు నిరంతర ప్రక్రియగా మారాయి.. వేలకోట్లు విలువైన ప్రభుత్వ భూములు ఇంత బహిరంగగా కబ్జాలకు పాల్పడుతుంటే..! రెవెన్యూ ఉన్నాధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం విశేషం.. బహుశా శుక్రవారం ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్ 307 సందర్శన కూడా, ఫిర్యాదుల కారణంగా మొక్కుబడిగా పరిశీలించినట్లు పలువురు ఆరోపిస్తున్నారు.. గతంలో కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లు సందర్శించి కబ్జాలను కట్టడి చేశారా..? ఇప్పుడు శుక్రవారం అధికారుల సందర్శన కూడా అంతేనని ఎద్దేవా చేస్తున్నారు..



## సర్వే నెంబర్ 307 మిథిలా నగర్‌లో కబ్జాలు పరిశీలించిన ఆర్డీవో..

కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం సర్వే నెంబర్ 307 మిథిలా నగర్ ప్రభుత్వ భూమిలో ఓ కబ్జాదారుడు 307/ఎ పేరుతో కోర్టు ఆర్డర్ ఉందని యధేచ్ఛగా కబ్జాలకు పాల్పడటంపై.. మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్ సంబంధిత కబ్జాలను శుక్రవారం పరిశీలించారు.. ఒకప్పుడు(ఎస్ఎఫ్‌సి కి కేటాయించడానికి పూర్వం)ప్రభుత్వం క్వారీలకు లీజుకు ఇచ్చారు.. లోతైన క్వారీ గుంతలను అక్రమంగా మట్టిని డంపింగ్ చేసి, పూడ్చుతూ, కొత్తగా మరికొన్ని బేస్మంట్‌లు నిర్మించినట్లు ఆర్డీవో గుర్తించారు.. తక్షణమే బేస్మంట్‌లను కూల్చివేయాలని, స్టే వెకెట్ చేయించి నిర్మాణాలు కూడా కూల్చివేయాలని తహశీల్దార్‌ను ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్ ఆదేశించారు.. మరోవైపు సంబంధిత కబ్జాదారుడు తెలివిగా వ్యవహరిస్తూ, ఒక ఆర్డర్‌ను పలుచోట్ల ఉపయోగించి కబ్జాలు చేపడుతున్నట్లు స్పష్టమవుతుంది..





- మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం..
- ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి తక్షణమే పరిష్కరించి న్యాయం చేయాలి..
- కేసులు నమోదైన వెంటనే విచారణ దశలోనే బాధితులకు నష్టపరిహారం అందించాలి..



## ఎస్సీ-ఎస్టీ కేసులు త్వరితగతిన పరిష్కరిస్తాం: కలెక్టర్ గౌతమ్..

విజిలెన్స్ మానిటరింగ్ కమిటీకి అధ్యక్షత వహించిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ కమీషన్ ఛైర్మన్ అందించిన సూచనలు తూచాతప్పకుండా పాటిస్తూ, సమస్యలను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీకి సంబంధించిన భూసమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలను 15 రోజుల్లో అందజేయాలని ఆర్డిఓలను, తహసీల్దార్లను ఆదేశించారు.. అనంతరం ప్రజలు అందించిన వినతులను ఛైర్మన్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డిసిపిలు కోటిరెడ్డి, పద్మజారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి రాచకొండ, సైబరాబాద్ పోలీసు అధికారులు, జిల్లా ఏస్సి,ఏస్టి కమీటీ మెంబర్లు జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి వినోద్ కుమార్, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ కేసులను.. తక్షణమే పరిష్కరించాలి..

## ఎస్సీ,ఎస్టీ కమీషన్ ఛైర్మన్ వెంకటయ్య..






**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 31:** అణచివే తకు గురైన ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలను మానవీయ కోణంలో ఆలోచించి..! ఒత్తిడులకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా చట్టపరమైన న్యాయం అందించే దిశగా జిల్లాయంత్రాంగం కృషి చేయాలని ఎస్సీ,ఎస్టీ కమీషన్ ఛైర్మన్ వెంకటయ్య పేర్కొన్నారు..

శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి ఎస్సీ, ఎస్టీ కమీషన్ ఛైర్మన్ వెంకటయ్య హాజరయ్యారు..ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి వాటిని తక్షణమే పరిష్కరించి బాధితులకు వెంటనే న్యాయం చేయాలని ఈ విషయంలో సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రభుత్వం చేపట్టే పౌరహక్కుల రక్షణ చట్టం (ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్-పీసీఆర్), అట్రాసిటీ నివారణ చట్టం (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ- పీవోఏ) చట్టాలను ఖచ్చితంగా అమలయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు ఉన్న కేసుల వివరాలు వాటి పురోగతిని ఛైర్మన్ అడిగి తెలుసుకొన్నారు.. ఈ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏమాత్రం పెండింగ్‌లో ఉంచరాదని ఆయన సూచించారు..

## శాఖల సమన్వయంతో కేసులను పరిష్కరించాలి..

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.. ఈ కేసులపై విచారణ వేగవంతం చేసి సకాలంలో బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులకి సూచించారు.. దీంతో పాటు అధికారులు ఎఫ్ఐఆర్ కేసులు నమోదైన వెంటనే విచారణ దశలో ఉన్న బాధితులకు నిబంధనల మేర నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్‌కు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సభ్యులను, ఛైర్మన్ కోరారు.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధిత అధికారులు పూర్తి నిబద్ధతతో తమ విధులు నిర్వర్తించాలని అధికారులకు సూచించారు. కేసులు పెట్టిన వారిపై రకరకాల ఒత్తిడులు వస్తుంటాయని దీనిని దృష్టిలో పెట్టుకొని వారికి పోలీసులు, ఇతర శాఖలు అండగా నిలవాలని ఛైర్మన్ స్పష్టం చేశారు..






## గద్దర్ ఆలోచనలు యువతకు స్ఫూర్తి దాయకం

- మొదటి పేజి తరువాయి

నడిపించిన గద్దర్ ను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం తెలుగు సినిమా చరిత్రలో గద్దర్ ఫిలిం అవార్డు లు ప్రకిటిస్తామన్నారు. ఆ బాధ్యత కూడా నాకే అప్పగించారన్న .. రాబోయే ఉగాది కి గద్దర్ ఫిల్మ్ అవార్డులు ఇస్తామన్నారు. గద్దర్ తో సహా అందె శ్రీ ,గోరేటి వెంకన్న ,పేర్లను గుర్తించాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు వీరు గొప్ప వ్యక్తులు తెలంగాణ అస్తిత్వం కోసం పోరాడారన్నారు. గద్దర్ అన్న ఆలోచనలు బావి తరాలకు అందించటానికి కాంగ్రెస్ నేతలందరం అందరం కలసి పని చేస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.

## మరో ఐదు రోజుల్లో ఎన్నికలు.. కేజ్రీవాల్‌కు బిగ్ షాకిచ్చిన ఆప్ ఎమ్మెల్యే



**హైదరాబాద్ పెన్ పవర్:** మరో ఐదు రోజుల్లో దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. గెలుపే లక్ష్యంగా అధికార ఆప్, ప్రతిపక్ష బీజేపీ పార్టీలు సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. ఓ పక్క ప్రచారం హోరెత్తిస్తూనే.. మరో పక్క హామీల వర్షం గుప్పిస్తూ ప్రజలను ఆకర్శిస్తున్నాయి. ఈ క్రమంలో అధికార ఆమ్ ఆద్మీ పార్టీకి బిగ్ షాక్ తగలింది. ఎన్నికలకు సరిగ్గా ఐదు రోజుల ముందు ఆప్ ఎమ్మెల్యే నరేష్ యాదవ్ పార్టీకి రాజీనామా చేశారు. ప్రస్తుతం మెహ్రౌలీ నియోజవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న నరేష్ యాదవ్ అదును చూసి కేజ్రీవాల్ పార్టీని దెబ్బకొట్టారు.
ఎమ్మెల్యే నరేష్ యాదవ్ ఖురాన్ ను అపవిత్రం చేసిన కేసులో దోషిగా తేలాడు. దీంతో అతడికి ఈ ఎన్నికల్లో ఆప్ ఎమ్మెల్యే టికెట్ నిరాకరించింది. నరేష్ యాదవ్ స్థానంలో మెహ్రౌలీ నియోజకర్గం నుంచి ఆప్ మహేందర్ చౌదరిని బరిలోకి దించింది. ఆప్ టికెట్ నిరాకరించడంతో అసంతృప్తికి గురైన నరేష్ యాదవ్.. సరిగ్గా ఎన్నికలకు ఐదు రోజుల ముందు పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు రాజీనామా లేఖను ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ కు పంపారు. ఎన్నికలకు ముందు పార్టీ ఎమ్మెల్యే రాజీనామా చేయడం అధికార ఆప్ కు ఇబ్బందికరంగా మారింది. ఆప్ కు గుడ్ బై చెప్పిన నరేష్ యాదవ్ బీజేపీ తీర్థం పుచ్చుకోనున్నట్లు సమాచారం.ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5వ తేదీన ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. 70 స్థానాలకు సింగల్ ఫేజ్ లో ఎన్నికలు నిర్వహిస్తామని ఇప్పటికే ఈసీ ప్రకటించింది. ఫిబ్రవరి 8వ తేదీన ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెలువడనున్నాయి. రెండు పర్యాయాలుగా తిరుగులేని విజయం సాధించిన ఆప్.. హ్యాట్రిక్ విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఎన్నో ఏళ్లుగా ఢిల్లీ అధికార పీఠానికి దూరంగా ఉన్న బీజేపీ.. ఈ సారి ఎలాగైన దేశ రాజధానిలో కాషాయ జెండా ఎగరేయాలని ఉవ్విళ్లూరుతోంది. గతంలో వరుసగా దశాబ్దం పాటు ఢిల్లీని పాలించిన కాంగ్రెస్.. హస్తినాలో తిరిగి పునర్వైభవం సాధించాలని ప్రయత్నిస్తోంది. ఆప్, కాంగ్రెస్, బీజేపీల ట్రయాంగిల్ పోరుతో ఢిల్లీ ఎన్నికలపై దేశ వ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. మరీ ఢిల్లీలో ఈ సారి ఏ పార్టీ విజయ ఢంకా మోగిస్తుందో తెలియాలంటే ఫిబ్రవరి 8 వరకు ఆగాల్సిందే.

# ఆధ్యాత్మికం: కర్మాచరణ... జ్ఞానం.....అంటే ఏమిటి? శ్రీకృష్ణుడు ఏం చెప్పాడో తెలుసా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతి మనిషి జీవితంలో కష్ట..సుఖాలు లాభ నష్టాలు ఉంటాయి. జీవితం అంటేనే అనుభవా లు పాఠాలు నేర్పుతాయని పెద్దలు అంటారు. ఈ అనుభవాలన్నీ .. కలా..మాయా... నిజమా అని ఇలా ఎన్నెన్నో ప్రశ్నలు వస్తుంటాయి. ఇవన్నీ కొన్ని ఆధ్యాత్మికపరంగా సంశయాలను ( అనుమాలను) కలుగజేస్తే ... మరికొన్ని భౌతికపరంగా ఏర్పడుతాయి. ఏది ఎలా ఉన్నా అలాంటి వాటిని పక్కనపెట్టి ముందుకు వెళ్లాలికదా.. దానిన్జ్ఞానం అంటారు. కాని సంశయం (అనుమానం) మానవుడిని చేసే పనిని అంటే కర్తవ్యాన్ని వెనక్కు లాగుతుంది. అది చేస్తే ఏమవుతుంది.. ఇది చేస్తే ఏమవుతుంది.. ఇలా అనేక ప్రశ్నలు వస్తుంటాయి.
సంశయం అంటే ఇదా.. అదా.. ఇలానా.. అలానా.. ఇప్పుడా.. అప్పుడా.. ఇలా ఆలోచిస్తూ ఒక నిర్ణయానికి రాలేము. అది ఇటు అటు రెండు వైపులా మానవులని లాగుతుంది. అలాంటి పరిస్థితిని సంశయం అని అంటారు. అలా కలిగినప్పుడు ఏదో ఒకటి చేయడము అనేది ఎప్పుడూ జరగదు. ఏదైనా ఒక నిర్ణయం ఏర్పడితేనే మంచైనా, చెడైనా చేయగలుగుతాడు. సంశయంలో ఉండి, ఊగిసలాడుతూన్నంత వరకు ఏమీ చేయలేడు. అర్జునుడికి ... శ్రీకృష్ణుడు ఎంతో ఉపదేశం చేసాడు. నాయినా నువ్వు తగినటువంటి భాద్యతని నెరవేర్చు కర్మని ఆచరించాలి. ఆ కర్మ ఒకవేళ తప్పుగ కనిపించిన బెంగ పడవద్దు , దానిని సవ్యంగా చేసుకుంటూ వెళ్ళు... అలా చేసినట్టైతే అది మంచి పనే అవుతుంది. నీకు అది ఈశ్వర ఆరాధన తో సమానమవుతుంది. వైద్యుడు శరీరాన్ని కోస్తాడు కాని దాన్ని మనం హింస అని అనటంలేదు కదా.. అది కోయకపోతే తప్పు వాడికి అది అవసరం. రోగికి అది అవసరం వైద్యుడు దాన్ని చేయాలి. అందుచేత చేసే పనిలో తప్పు ఉన్నా ఫరవాలేదు ఐతే చేసేటప్పుడు ఎందుకు చేస్తున్నామో .. అది లోకానికి.. ప్రజలకు.. తనకు ఎంత మంచి.. చెడా అనే ఒక నిర్ణయానికి వచ్చి దానిని చేయాలా వద్దా అనేది తెలుసుకొమ్మని చెప్పాడు. ఎలాంటి పరిస్థితుల్లో చేయాలో చక్కగ వివరించాడు.. శ్రీకృష్ణుడు.. జ్ఞానం. ఆ జ్ఞానం ఎట్లా ఉండాలి.. ఆ పని చేయడం కేవలం స్వార్థం కోసమా.. ఎంతమందికి ఉపయోగపడుతుంది అనే విషయాలను పరిగణనలోకి తీసుకోవాలి. స్వలాభం కోసం కాదు. లోకాన్ని .. ప్రజలను..దృష్టిలో పెట్టుకొని ఎంతమంది శ్రేయస్సు కలుగుతుంది. ఇది ప్రపంచ వ్యవస్థకి ఎంతమేరకు అవసరపడుతుంది. అవన్నీ ఆలోచించాలి. దానిన్జ్ఞానం అంటారు. ్ఞనం ప్రకారం చేసి తీరాలి. ప్రతి పనికి జ్ఞానం చాలా ప్రధానం సుమా.. అని శ్రీకృష్ణుడు .. అర్జునిడికి చెప్పారు. మనం కూడా సమాజానికి .. మనకి కూడా మంచి చేసుకోవాలి అనుకుంటున్న వ్యక్తులం కనక మంచి గురించి మనకి ఒక నిర్ణయం ఏర్పడాలి. ఐతే మన అనుభవం , మనకుండేటటు వంటి జీవితం చాలా తక్కువ కనక అనుభవించినటు వంటి పెద్దల యొక్క ఉపదేశం మన ఆసరాగా తీస్కున్నట్లయితే త్వరగా ముందుకి సాగగలుగుతాం. అనుభవించి నటువంటి వ్యక్తులు ఎవరు.. ఏం చెప్పాలి వాళ్ళు మనకి, ఎట్లా చెప్తారు.
లోకంలో ఉండేటటు వంటి వ్యక్తులు ఒక్కొక్కరూ ఒక్కొక్క మార్గం మనకి చూపిస్తుంటారు, నలుగురిని ఆశ్రయించి మనం వినేటప్పటికి అస్సలు ఏది తగునో ఏది తగదో నిర్ణయించుకోలేని స్థితిలోకి వెళ్ళిపోతుంటాము. అందుకే భగవంతుడు తానే నేరుగ భాద్యత తీసుకొని, ఏది తగునో దాన్ని నిర్ణయించి చెప్పడానికి, ఏది తగదో దాన్ని మానమని చెప్పడానికి ఈ లోకం లోకి దిగివచ్చాడు శ్రీకృష్ణుడై అవతరించాడు.

# ఫిబ్రవరి 3వ తేదీ కుంభమేళా ప్రత్యేకత ఏంటీ.. ఆ రోజు పుణ్య స్నానం చేస్తే ఎలాంటి ఫలితం కలుగుతుంది..




**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తరప్రదేశ్ ప్రయాగ్ రాజ్ లో కుంభమేళా జరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా భక్తులు పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. జనవరి 13 భోగి పర్వదినాన ప్రారంభమైన కుంభమేళా 45 రోజుల పాటు .. అంటే ఫిబ్రవరి 26 వ తేదీన ముగుస్తుంది. కుంభమేళాలో మొత్తం ఆరు రాజ స్నానాలు జరుగనున్నాయి. ఇవి వరుసగా భోగి, మకర సంక్రాంతి, పుష్య బహుళ అమావాస్య, వసంత పంచమి, మాఘ పౌర్ణమి, మహా శివరాత్రి రోజు జరుగనున్నాయి. ఇప్పటికే మూడు రాజ స్నానాలు ముగియగా నాలుగో రాజస్నానం వసంత పంచమి ( ఫిబ్రవరి 3) వ తేది జరగనుంది.

### వసంత పంచమి రోజున నాలుగో రాజస్నానం ఎందుకు చేయాలి..

పురాణాలు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రహ్మదేవుడి ప్రార్థన వలన సరస్వతి దేవి ఆ రోజున అంటే మాఘమాసం శుద్ధ పంచమి రోజున ( ఈ ఏడాది ఫిబ్రవరి 3) జన్మించింది. సరస్వతి దేవి చదువుల తల్లి.. విద్యకు అధిదేవత అని పండితులు చెబుతారు. ఇక ఈ ఏడాది కుంభమేళా జరుగుతుంది కాబట్టి ఆరోజు పుణ్య స్నాన చేయాలని పురాణాల ద్వారా తెలుస్తుంది. వసంతపంచమి రోజున కుంభమేళాలో పుణ్య స్నానం చేసేవారు ముందుగా నదీమతల్లికి నమస్కరించాలి. తరువాత నదిలో చిటికెడు పసుపు.. కుంకుమ వేయాలి. తరువాత నది ఒడ్డున కొద్దిగా మట్టిని తీసుకొని నమస్కరిస్తూ నదిలోకి ప్రవేశించాలి. తరువాత ఆ మట్టిని దోసెలలో ఉంచి నదిలో కలిపి.. మూడుసార్లు తల మునిగే వరకు మునగాలి.
ఆ తరువాత సూర్య భగవానుడికి అర్ఘ్యం ఇవ్వాలి. ముఖం తూర్పు దిక్కున ఉండే విధంగా నిలబడి దోసెలతో మూడు సార్లు నీళ్లు తీసుకుని వదలాలి. తరువాత నది నుంచి బయటకు వచ్చి.. నదికి నమస్కరించి పసుపు.. కుంకుమ..పూలతో పూజించి.. హారతి ఇవ్వాలి. అరటి దొన్నెలో దీపం వెలిగించి నదిలో వదిలి నమస్కారం చేయాలి. తరువాత పేదలకు.. బ్రాహ్మణులకు శక్తి కొలది దానం చేయాలి.
కుంభమేళాలో వసంత పంచమి రోజు (ఫిబ్రవరి 3) పుణ్య స్నానం చేస్తే చాలా మంచిదని పురాణాలు చెబుతున్నాయి. పిల్లలకు విద్యలో రాణిస్తారు. వసంత పంచమి సరస్వతి దేవి పుట్టిన రోజు.. ఆ రోజు జీవ నదుల్లో సరస్వతి దేవి నిక్షిప్తమై ఉంటుందని పండితులు చెబుతున్నారు. అందుకే నదీమ తల్లికి పూజలు చేసి హారతి ఇవ్వాలి. చదువుకునే పిల్లలకు పుస్తకాలు ... పెన్నులు.. పెన్సిళ్లు పంచి పెట్టాలి.

# నువ్వు తగ్గొద్దన్నో: నేను వెళ్లి స్విమ్మింగ్ చేయాలా ఏంటి?: ట్రంప్ టెంపర్ ఆన్సర్




**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి తన చాతుర్యం చూపించారు. జర్నలిస్టులపై తనదైన స్టయిల్‌లో చురకలు వేశారు. అమెరికాలోని వాషింగ్టన్ డీసీ సమీపంలో విమానం, హెలికాప్టర్ ఢీకొని ఘోర ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. వైట్ హౌస్‌కు సమీపంలోని జరిగిన ఈ విమాన ప్రమాదంపై ట్రంప్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ జర్నలిస్ట్ మాట్లాడుతూ.. అమెరికా చరిత్రలోనే అత్యంత ఘోర ప్రమాదం.. వైట్ హౌస్ సమీపంలోనే జరిగింది.. మీరు స్పాట్‌కు వెళ్లి పరిశీలిస్తున్నారా అని ప్రశ్నించాడు.అంతే ఈ ప్రశ్న వినగానే ట్రంప్‌కు చిర్రెత్తుకొచ్చింది. దీనికి ఆయన ఆన్సర్ ఏంటో తెలుసా.. నేను వెళ్లి అక్కడ స్విమ్మింగ్ చేయాలా..? నేను స్మిమ్మింగ్ చేస్తే మీరు చూస్తారా..? అంటూ ఆన్సర్ ఇచ్చారు. అంతే ప్రశ్న అడిగిన జర్నలిస్ట్ షాక్ అయితే.. మిగతా జర్నలిస్టులు ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు.


**64 మంది మృతి**

గురువారం(జనవరి 30) అమెరికాలోని వాషింగ్టన్ డీసీ సమీపంలో ఘోర ప్రమాదం జరిగింది. ఎవరూ ఊహించని రీతిలో ప్రయాణికుల విమానం, సైనిక హెలికాప్టర్ ఢీకొన్నాయి. కాన్సాస్‌లోని విషిటా నుంచి బయల్దేరిన పీఎస్ఏ ఎయిర్‌లైన్స్ విమానం.. రోనాల్డ్ రీగన్ నేషనల్ ఎయిర్‌పోర్టు రన్‌వేపై దిగేందుకు సిద్ధమవుతుండగా.. సైనిక హెలికాప్టర్ సికోర్‌స్కీ హెచ్-60 బ్లాక్‌హాక్ వెళ్లి ఢీకొంది. ప్రమాదం తరువాత రెండూ నదిలో పడిపోయాయి. ఈ ఘటనలో 64 మంది ప్రాణాలు కోల్పోయారు.

ఈ ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై అధికారులు దర్యాప్తు చేపట్టగా.. సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్‌లో సిబ్బంది కొరత కూడా ప్రమాదానికి ఓ కారణంగా తెలుస్తోంది.

# చర్మం నల్లబడుతోందా...? కారణమిదే అంటున్న వైద్యులు!

- సాధారణంగా ఫెయిర్ గా ఉండేవారు కూడా ఉన్నట్టుండి నల్లబడే తీరు
- దీనికి కొన్ని రకాల కారణాలు ఉన్నాయంటున్న వైద్య నిపుణులు
- త్వరగా గుర్తించి, జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని సూచనలు



**హైదరాబాద్ పెన్ పవర్:**మంచి కాంతివంతమైన చర్మంతో ఉన్నవారు కూడా కొన్నిసార్లు ఉన్నట్టుండి నల్లబడిపోతుం టారు. చర్మం కళావిహీనమైపోతుంది. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కూడా ఆ ఇబ్బంది అలాగే ఉంటుంది. దీనికి చాలా రకాల కారణాలు ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా జీర్ణ వ్యవస్థ పనితీరుకు, మన చర్మం రంగు, ఆరోగ్యానికి లింక్ ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. దీనిని ముందే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే... నిగనిగలాడే, కాంతివంతమైన చర్మం మీ సొంతమవుతుందని వివరిస్తున్నారు.

## చర్మానికి, జీర్ణ వ్యవస్థకు ఏమిటి లింకు?

మనం తినే ఆహారం నుంచి తగిన పోషకాలు శరీరానికి అందాలంటే... జీర్ణ వ్యవస్థలో ఆ ఆహారం బాగా జీర్ణం కావాలి, అదే సమయంలో పోషకాలన్నీ బాగా సంగ్రహించగలగాలి. ఇందులో ఏమాత్రం తేడా వచ్చినా మన మొత్తం ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. అందులోనూ ముఖ్యంగా చర్మంపై ఎక్కువ ప్రభావం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. జీర్ణ వ్యవస్థ పనితీరు సరిగా లేకపోవడమనేది... చర్మానికి సంబంధించిన చాలా సమస్యలకు దారితీస్తుందని స్పష్టం చేస్తున్నారు.

## రంగు తగ్గిపోయి... కళ్ల కింద నల్లటి వలయాలతో...

జీర్ణ వ్యవస్థ సరిగా పనిచేయకుంటే... శరీరంలో ఇన్ ఫ్లమేషన్ స్థితి తలెత్తుతుంది. ఇది చర్మాన్ని కళావిహీనం చేస్తుంది. చర్మం పొడిబారిపోతుంది. రంగు తగ్గిపోతుంది. ముడతలు పడటం ద్వారా వయసు ఎక్కువగా కనిపించేలా చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు... ఎసిడిటీ, గ్యాస్, ఇతర జీర్ణ సంబంధ సమస్యలు ఉన్నవారిలో కళ్లకింద నల్లటి వలయాలు (డార్క్ సర్కిల్స్) ఎక్కువగా ఏర్పడతాయని అమెరికాకు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఎన్ఐహెచ్) అధ్యయనంలోనే తేలింది.

## ఈ సమస్య నుంచి ఎలా బయటపడాలి?

జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా, బాగా పనిచేసేలా చూసుకోవడం చాలా ముఖ్యం. ఇందుకోసం ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, ఇతర పోషకాలు పుష్కలంగా ఉండే పండ్లు, కూరగాయలు తీసుకోవడం అవసరం. ముఖ్యంగా పెరుగు వంటి ప్రొబయాటిక్స్ వినియోగించడం మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇదే సమయంలో ఒత్తిడిని తగ్గించుకోవడం, శరీరానికి తగిన వ్యాయమం, విశ్రాంతి, నిద్ర ఉండేలా చూసుకోవడం ముఖ్యమని స్పష్టం చేస్తున్నారు. వీటిని పాటిస్తే ఆరోగ్యవంతమైన జీర్ణ వ్యవస్థతోపాటు మంచి కాంతివంతమైన చర్మం మీ సొంతం అవుతుందని పేర్కొంటున్నారు.

# మమతా కులకర్ణిని బహిష్కరించిన కిన్నార్ అఖాడా

- కుంభమేళాలో సన్యాసం స్వీకరించిన మమతా కులకర్ణి
- ఆమెను మహామండలేశ్వర్ గా నియమించిన లక్ష్మీనారాయణ త్రిపాఠి
- మమత, త్రిపాఠిలను తొలగించిన కిన్నార్ అఖాడా



**హైదరాబాద్ పెన్ పవర్:**బాలీవుడ్ అలనాటి అందాల తార మమతా కులకర్ణి ఇటీవల సన్యాసం తీసుకున్న సంగతి తెలిసిందే. ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న కుంభమేళా సమయంలో ఆమె సన్యాసం స్వీకరించారు. కిన్నార్ అఖాడాలో ఆచార్య మహామండలేశ్వర్ లక్ష్మీనారాయణ త్రిపాఠి సమక్షంలో ఆమె దీక్ష తీసుకున్నారు. ఆమెను మహామండలేశ్వర్ గా నియమించారు. అయితే మమతా కులకర్ణిని మహామండలేశ్వర్ గా నియమించడం వివాదాస్పదం కావడంతో... తాజాగా ఆమెను కిన్నార్ అఖాడా నుంచి తొలగించారు. ఆమెతో పాటు ఆచార్య మహామండలేశ్వర్ లక్ష్మీనారాయణను కూడా బహిష్కరించారు. కిన్నార్ అఖాడా వ్యవస్థాపకుడు రిషి అజయ్ దాస్ వీరిద్దరిని బహిష్కరించినట్టు సమాచారం.

తన అనుమతి లేకుండా మమతకు దీక్ష అందించడం, మమతపై గతంలో డ్రగ్స్ కేసు ఉండడం వంటి కారణాలతోనే రిషి అజయ్ దాస్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.


# దేశంలోనే రెండో అతిపెద్ద గిరిజన జాతర నాగోబా



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్‌లో నాగోబా మహాజాతర జనవరి 28 నుంచి ఫిబ్రవరి 4 వరకు జరుగుతోంది. ప్రతి ఏటా పుష్య మాసం అమావాస్య రోజున అర్ధరాత్రి మహాపూజలతో మెస్రం వంశస్తులు ఈ జాతరను ప్రారంభించారు. నాగోబా (శేషనారాయణమూర్తి) ఆదివాసీల ఆరాధ్య దైవం.తెలంగాణ రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందింది. దేశంలో సమ్మక్క సారలమ్మ జాతర తర్వాత రెండో అతిపెద్ద గిరిజన జాతరగా ఖ్యాతి పొందింది. సర్పజాతిని పూజించడమే ఈ పండుగ ప్రత్యేకత. నాగోబా జాతర గోండుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక. గిరిజన సంస్కృతి, ఆచారాలు, విశ్వాసాలకు అద్దం పట్టే వేడుక. ఈ జాతరను సంరక్షించడం అంటే మన సంస్కృతిని సంరక్షించడమే. ఈ జాతరలో ప్రకృతిని పూజిస్తారు. గోదావరి నది నుంచి తీసుకొచ్చిన పవిత్ర గంగా జలంతో నాగోబాను అభిషేకిస్తారు.

జాతర సందర్భంగా నాగోబా అభిషేకానికి అవసరమయ్యే గంగాజలం(గోదావరి నదీ జలం) కోసం మెస్రం వంశీయులు ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నుంచి మహా పాదయాత్ర చేపట్టి మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగు మీదుగా ప్రవహించే గోదావరి నది నుంచి వీరు గంగాజలం సేకరిస్తారు. వీరు రానుపోను 215 కి.మీ. మేర కాలినడకన ప్రయాణిస్తారు.

## గద్దర్ పద్మశ్రీకి అన్ని విధాల అర్హుడు: ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



**హైదరాబాద్ పెన్ పవర్:**పద్మ శ్రీ అవార్డుకు గద్దర్ అన్ని విధాల అర్హులని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. రవీంద్ర భారతిలో జరిగిన గద్దర్ జయంతి ఉత్సవాల సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఎమ్మెల్యే వివేక్. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించి గద్దర్ కి పద్మశ్రీ అవార్డు వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమం కోసం గద్దర్ విశేష కృషి చేశారని చెప్పారు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి. ఆయన పాటలతో తెలంగాణ ఉద్యమాన్ని మరో స్థాయికి తీసుకెళ్లారని కొనియాడారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా గద్దర్ లో జోష్ తగ్గలేదన్నారు ఎమ్మెల్యే వివేక్. కాక వెంకటస్వామి.. గద్దర్ ఆలోచనలు ఒకేలాగా ఉండేవన్నారు. ఇద్దరు కుల మతాబేధాలు లేకుండా వ్యవహరించేవారని చెప్పారు. ఎప్పుడు ప్రజల్లో ఉంటూ ప్రజల కోసం పరితపించేవారని తెలిపారు. గద్దర్ కుటుంబంలో కంటే ప్రజల్లో ఎక్కువగా ఉండేవారని ఎమ్మెల్యే వివేక్ అన్నారు.

## పార్టీ ఫిరాయింపులు.. తెలంగాణ స్పీకర్‌పై సుప్రీం కోర్టు సీరియస్



**హైదరాబాద్ పెన్ పవర్:**పార్టీ ఫిరాయింపులపై అంశంపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ పై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇవాళ (శుక్రవారం, జనవరి 31) సుప్రీం కోర్టులో పార్టీ ఫిరాయింపులపై విచారణ జరిగింది. ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవడానికి ఎంత సమయం కావాలని ఈ సందర్భంగా సుప్రీం కోర్టు ప్రశ్నించింది. తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటామన్న సమాధానానికి.. "మీ దృష్టిలో తగిన సమయం అంటే ఎంత.. రీజనబుల్ టైమ్ అంటే మహారాష్ట్ర తరహా అసెంబ్లీ గడువు ముగిసే వరకా.." అంటూ ధర్మాసనం ప్రశ్నించింది.

పార్టీ ఫిరాయింపులపై ఎప్పుడు నిర్ణయం తీసుకుంటారో చెప్పాలని సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనికి న్యాయవాది ముకుల్ రోహాత్గీ సమాధానంగా తెలంగాణ స్పీకర్ ను అడిగి నిర్ణయం చెబుతామని తెలిపారు. తదుపరి విచారణ వచ్చే వారానికి వాయిదా వేసింది.

# ఉస్మానియా కొత్త ఆస్పత్రికి సీఎం రేవంత్ భూమి పూజ

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ గోషామహల్ పోలీస్ గ్రౌండ్ లో కొత్త ఉస్మానియా హాస్పిటల్ బిల్డింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎస్ శాంతికుమారి, మంత్రులు దామోదర రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ,ఎమ్మెల్యే దానం నాగేందర్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఉస్మానియా హాస్పిటల్ అంతర్జాతీయ స్థాయిలో నిర్మాణం జరగనుంది. రాబోయే వందేండ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని 26 ఎకరాల విస్తీర్ణంలో, రెండువేల బెడ్స్ సామర్థ్యంతో ఈ కొత్త హాస్పిటల్ ను నిర్మించనున్నారు. పాత హాస్పిటల్ లో లేని అధునాతన సౌకర్యాలను ఈ కొత్త హాస్పిటల్ లో అందుబాటులోకి తీసుకురానున్నారు. రూ. 2,400 కోట్లతో 14 అంతస్తుల్లో



ఉస్మానియా ఆస్పత్రి భవన నిర్మాణం చేపడుతోంది ప్రభుత్వం

90 దయాలసిస్, హిమోఫిల్ట్రేషన్ సీఆర్ఆర్టీ మెషిన్లు, 500 బెడ్లతో కూడిన ఐసీయూలు, అత్యాధునిక టెక్నాలజీ, వసతులతో కూడిన మార్చురీ, ప్రతి డిపార్ట్‌మెంట్ కోసం స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఫెసిలిటీస్‌తో కూడిన ఆపరేషన్ థియేటర్లు, పోస్ట్ ఆపరేటివ్ వార్డులు అందుబాటులో రానున్నాయి. కిడ్నీ, లివర్, స్కిన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ల కోసం అత్యాధునిక టెక్నాలజీతో కూడిన మల్టీ ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంటేషన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగం అందుబాటులోకి రానుంది. ఫైర్ స్టేషన్, పోలీస్ అవుట్ పోస్ట్ కూడా ఉంటాయి.

# హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలకు రక్షణ

**జయశంకర్ భూపాలపల్లి, పెన్ పవర్:** హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలు పోకుండా బయట పడొచ్చని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా రవాణా మరియు పోలీసుశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్మెట్ అవగాహన మోటారు సైకిల్ ర్యాలీలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేలు పాల్గొన్నారు. ఐడిఓసి కార్యాలయం నుండి గణేష్ చౌక్ మీదుగా డా బిఆర్ అంబేద్కర్ సెంటర్ వరకు కొనసాగిన ర్యాలినీ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ జెండా ఊపి ప్రారంభించగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు హెల్మెట్ ధరించి వాహనాలు నడిపి పలువురిని ఆకర్షించారు.

అనంతరం డా బిఆర్ అంబేద్కర్ సెంటర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ పలువురు డ్రైవర్లకు ఉచిత కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలను కాపాడుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. దేశంలో సగటున 70 శాతం రోడ్డు ప్రమాదాలలో ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించకపడోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని, ఇది చాలా బాధాకరమని తెలిపారు. ప్రతి ద్విచక్ర వాహన దారులు విధిగా హెల్మెట్ ధరించాలని, ఇతర వాహనాలు నడిపే డ్రైవర్లు సీట్ బెల్ట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. రోడ్డు పై ప్రయాణం చేసే సమయంలో ప్రతి ఒక్కరూ ఒక్క సారి తమ కుటుంబ సభ్యులను గుర్తుచేసుకుని వాహనం నడపాలని,



తమతో పాటు ఇతరులకు ఇబ్బందులు కలగకుండా రోడ్డు భద్రతా నియమాలను, ప్రమాణాలను పాటిస్తూ వాహనాలు నడిపి సురక్షితంగా గమ్యం చేరాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ జిల్లాలో వాహనదారులకు రోడ్డు భద్రత, హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించడానికి హెల్మెట్ ర్యాలీ నిర్వహించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఎక్కువగా బొగ్గు, ఇసుక లారీలు రవాణా ఎక్కువగా జరుగుతుందని రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు పెద్ద సంఖ్యలో ద్విచక్ర ప్రమాదాల బారినపడి గాయపడి మరణిస్తున్నారని తెలిపారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలను కాపాడుకోవచ్చు అని తెలిపారు.

ప్రతి రోజు పోలిస్ శాఖ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, మద్యం సేవించి వాహనం నడుపుతున్న కొంత మందిని జైలుకు పంపిన సంఘటనలు ఉన్నాయన్నారు. వాహన దారులు రోడ్డు పై ప్రయాణించేటప్పుడు ఇతరులకు ఇబ్బందులు కలగకుండా ప్రయాణించాలని తెలిపారు. యువత ఎక్కువగా బైక్ లపై రాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాల బారిన పడుతూ తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగులుస్తున్నారని అన్నారు. యువత తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలను, ఆశయాలను గుర్తు పెట్టుకుని, వేగ నియంత్రణ

పాటించాలని ఎస్పీ సూచించారు. అంబేద్కర్ సర్కిల్ లో కళాకారులు హెల్మెట్ దరించాలని అట, పాటలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, రవాణా శాఖ అధికారి మహమ్మద్ సంధాని, అదనపు ఎస్పీ బోనాల కిషన్, డిఎస్పీ సంపత్ రావు, సిఐలు నరేష్ కుమార్, మల్లేష్, ఎస్ఐలు, సింగరేణి , జెన్కో అధికారులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, బార్ అసోసియేషన్ సభ్యులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంకోసారి గద్దర్ గురించి తప్పుగా మాట్లాడితే.. నాంపల్లికి ఆయనే పేరే పెడతాం: సీఎం రేవంత్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఒంటరిననే ఫీలింగ్ వచ్చినప్పుడల్లా గద్దర్ దగ్గరకు వెళ్లేవాడిని.. నీ బాధ్యత నువ్వు నెరవేర్చు.. ప్రజలే నీకు అవకావం ఇస్తారని ఆయన చెప్పేవారని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గద్దర్ చెప్పినట్లే నా బాధ్యత నెరవేర్చాను.. ప్రజలు నాకు అవకాశం ఇచ్చారని అన్నారు. ప్రజాయుద్ధ నౌక గద్దర్ 77వ జయంతి సందర్భంగా హైదరాబాద్ రవీంద్ర భారతిలో భాషా సాంస్కృతిక శాఖ, గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జయంతి వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పో రాటం చేసిన గద్దర్ పేరిట అవార్డు ఇవ్వాలని నిర్ణయించుకున్నామని.. ఆయన పేరిట అవార్డు ఇవ్వడమంటే ప్రతియేటా ఆయనను స్మరించుకోవడమేనని అన్నారు. సమాజానికి స్ఫూర్తినిచ్చేలా గద్దర్ అవార్డు ఉండాలని భావించానని.. అందుకే గద్దర్ అవార్డుల బాధ్యతను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అప్పగించానని తెలిపారు. గద్దరన్న మరణించినప్పుడు ఆయన చివరిచూపు ప్రజలందరికీ దక్కాలని ఎల్బీ స్టేడియానికి తీసుకొచ్చామని.. కానీ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం స్టేడియం గేట్లకు తాళం వేసిందని ఫైర్ అయ్యారు. గద్దర్ చివరి శ్వాస వరకు తాను నమ్మిన సిద్ధాంతాల కోసం జీవించారని కొనియాడారు. ఈ ఏడాది రాష్ట్రం నుంచి ఐదుగురికి పద్మ అవార్డులు ఇవ్వాలని కేంద్రానికి సిఫార్సు చేశాం. గద్దర్, గోరటి వెంకన్న, చుక్కా రామయ్య, అందె శ్రీ, తిరుమలరావుకి పద్మ అవార్డులు ఇవ్వాలని ప్రతిపాదించామని తెలిపారు. కానీ పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ నుంచి ఐదుగురి పద్మ అవార్డులు ఇచ్చారు.. వాళ్ల కంటే మేం ప్రతిపాదించిన వాళ్లు తక్కువా అని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. కేంద్ర చేసిన తప్పును సరిదిద్దుకుంటుందని లేఖ కూడా రాశా.. కానీ వాళ్లు తప్పు సరిదిద్దుకోకుండా గద్దర్ కు అవార్డ్ ఇవ్వమని అన్నారని అసహనం వ్యక్తం చేశారు. ఇంకోసారి గద్దర్ గురించి తప్పు మాట్లాడితే.. సంబంధిత పార్టీ కార్యాలయం (పరోక్షంగా బీజేపీ) ఉండే ప్రాంతానికి గద్దర్ పేరు పెడతామని సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలోనూ కొందరు నేతలు గద్దర్ ను ప్రజా భవన్ బయట నిలబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గద్దర్ ను ప్రజా భవన్ బయట నిలబెట్టిన వ్యక్తులు.. ఇప్పుడు ప్రజా భవన్ బయట ఉన్నారని అన్నారు. గద్దర్ గురించి తప్పుగా మాట్లాడిన వ్యక్తికి ఓట్ల విప్లవం చూపిస్తామని హెచ్చరించారు. రాహుల్ గాంధీతో మాట్లాడి గద్దర్‌కు మేమే అవార్డు ఇప్పిస్తామన్నారు.

# పొట్టిగారిపల్లి లో లేగ దూడల కార్యక్రమం మహోత్సవం

**హైదరాబాద్ పెన్ పవర్:** కడప జిల్లా బద్వేల్ మండల పరిధిలోని పొట్టిగారిపల్లి గ్రామంలో శుక్రవారం న రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆంధ్రప్రదేశ్ పశు సంవర్ధక శాఖ,ఆంధ్ర ప్రదేశ్ పశు గణాభివృద్ధిసంస్థ ఆధ్వర్యంలో జాతీయ కృత్రిమ గర్భదారణ ద్వారా పుట్టిన లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమములో 37 కృత్రిమ గర్భదారణ ద్వారా పుట్టిన దూడలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో దూడలను పరిశీలించి ఆరోగ్యవంతంగా ఉండే మొదటి బహుమతి రెండో బహుమతి మూడో బహుమతి దూడల యజమానులకు అందజేశారు అదేవిధంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న మిగతా రైతులకు కూడా బహుమతులతో ప్రోత్సహించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ శారదమ్మ జిల్లా పశుసంవర్ధక అధికారి ప్రారంభించి ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువులలో ఎదకు రావడానికి, ఎద లక్షణాలు వాటి ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం డాక్టర్ రమణయ్య ఉప సంచాలకులు మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం వల్ల ఉపయోగాలు వాటిని విరివిగా రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు మరియు పశువులలో మేలైన యాజమాన్య పద్దతులు, ఎడాదికి ఒక దూడ ప్రాముఖ్యతను వివరించారు.కడప డి ఎల్ డి ఏ డా? శరత్ కుమార్, మాట్లాడుతూ ప్రభుత్వం 1350 రూపాయలు ధర నిర్ణయించి లింగ నిర్దరిత వీర్యం ప్రవేశపెట్టారు. సబ్సిడి రూ॥ 850/- రైతు 500 చెలిస్తే లింగ నిర్ధారిత వీర్యం అందిస్తోంది. వాటి ప్రాముఖ్యతను రైతు సోదరులు ఉపయోగించుకోవాలన్నారు. డా? పవన్ కుమార్ మాట్లాడుతూ లేగ దూడల సంరక్షణ, దూడల యాజమాన్య పద్దతులు గురించి వివరించారు. డా? హేమలత మాట్లాడుతూ పశువులలో వచ్చే గర్భకోశవ్యాదులు,దూడల పెంపకం లింగనిర్ధారణ వీర్యం వల్ల లాభాలను వివరించారు మరియు పశు వులలో వచ్చే వ్యాధులు నివారణ చర్యలు గురించి వివరించారు. ఈ కార్యక్రమములో పశుసంవర్ధక సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొనారు...

# సీఎం రేవంత్ ను కలిసిన దేశ్ పాండే ఫౌండేషన్

**హైదరాబాద్ పెన్ పవర్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశ్ పాండే ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం కలిసారు. ఫౌండేషన్ గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక పరిస్థితుల మార్పు కోసం పని చేస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఆంగ్లంలో శిక్షణ ఇస్తుంది. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచడానికి పనిచేస్తుంది. రాష్ట్రంలో తమ కార్యక్రమాల విస్తరణ కు ప్రభుత్వ సహకారం కోరింది. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కస్తుర్భా బాలికల పాఠశాల్లో పని చేయాలని సూచించారు. మహబూబ్ నగర్ లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ను దత్తత తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలకు ఫౌండేషన్ అంగీకరించింది. ఈ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్ బాబు ,సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు గురురాజ్ దేశ్ పాండే ,జయ శ్రీ దేశ్ పాండే,రాజు రెడ్డి, జీ.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాలు సద్వినియోగం చేసుకోవాలి

**మంథని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్**

**దరఖాస్తులకు చివరి తేదీ ఫిబ్రవరి 1**



హైదరాబాద్ పెన్ పవర్:గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలని మంథని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్ శు క్రవారం పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడుతున్న గురుకులాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ఉమ్మడి గురుకులాల 5వ తరగతి ప్రవేశ పరీక్షకు అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోగలరని ఆయన కోరారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఎస్సీ ఎస్టీ బీసీ జనరల్ గురుకులాలలో 5వ తరగతి ప్రవేశ పరీక్షకు, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6 నుండి 9 తరగతిలో ఖాళీల కొరకు ప్రవేశానికి, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గౌలిదొడ్డి, అలుగునూరు సిఓఈలో 9వ తరగతి ప్రవేశానికి, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ ఖమ్మం, పరిగి ఎస్ఓఈలో ఎనిమిదో తరగతి ప్రవేశానికి, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజ్ గిరి ఫైన్ ఆర్ట్ స్కూల్ లో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అయన పేర్కొన్నారు. విద్యార్థులు ఫిబ్రవరి 01 లోపు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకోవడానికి విద్యార్థి కులం సర్టిఫికెట్ నెంబర్, ఆదాయం సర్టిఫికెట్ నెంబర్, ఆధార్ కార్డు నెంబర్, బర్త్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, ఫోటో లతో ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోగలరని ఆయన సూచించారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 23వ తేదీన ఉంటుందని ఆయన గుర్తు చేశారు. గురుకులాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆయన తెలిపారు.

## ఓయూలో నిరుద్యోగుల నిరసన

**హైదరాబాద్ పెన్ పవర్:**కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ కాలండర్ ప్రకటిస్తానని నిరుద్యోగులను మోసం చేశారని ఓయూ జేఏసీ నేత మోతిలాల్ నాయక్ అన్నారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రధాన లైబ్రరీ వద్ద ఓయూ జేఏసీ నేత మోతిలాల్ నాయక్ ఆధ్వర్యంలో నిరుద్యోగులు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మోతిలాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి జాబ్ కాలంలో విడుదల చేయాలి లేని పక్షంలో వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించడానికి ప్రచారం చేస్తామని డిమాండ్ చేశారు. గతంలో పెంచిన ప్రభుత్వ ఉద్యోగుల వయోపరిమితిని వెంటనే తగ్గించి ఉద్యోగుల వయోపరిమితి వయసు 58 సంవత్సరాలకు తగ్గించాలి లేనిపక్షంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

## కారు బోల్తా.. దంపతులకు గాయాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** 161 వ జాతీయ రహదారిపై అదుపుతప్పి కారు బోల్తా పడింది. చౌటాకూర్ మండలం సరఫ్ పల్లి వద్ద జాతీయ రహదారి పై ఓవర్ బ్రిడ్జి పై అదుపుతప్పి కారు బోల్తా కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న నారాయణఖేడ్ కు చెందిన దంపతులకు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను నేషనల్ హైవే అంబులెన్స్ లో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నారాయణఖేడ్ నుండి సంగారెడ్డి వైపు వస్తుండగా ఘటన జరిగింది.

# బ్యాంకింగ్ సేవలు ప్రజలకు అందేలా చర్యలు

- ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు తోడ్పాటు ఉండాలి
- యువతకి స్వయం ఉపాధి అందేలా రుణాలను సత్వరం మంజూరు చేయాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి పెన్ పవర్:**బ్యాంకింగ్ సేవలు జిల్లాలోని ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బ్యాంకర్లను ఆదేశించారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి బ్యాంకర్లతో డీసీసీ, డీ.ఎల్.ఆర్.సి సమావేశం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా ప్రజలకు అందే రుణాలు పెరగాలని, జిల్లాలో డిసెంబర్ 31 నాటికి క్రెడిట్ డిపాజిట్ నిష్పత్తి 102% ఉందని, జిల్లాలో ప్రతి బ్యాంకు సిడి నిష్పత్తి పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని రైతులకు పంట రుణాల క్రింద 1864 కోట్లు పంపిణీ చేయడం లక్ష్యం కాగా డిసెంబర్ చివరి నాటికి 1037 కోట్ల పంపిణీ చేశామని, పెండింగ్ లక్ష్యాన్ని చివరి క్వార్టర్ లో యాసంగి పంటకు పూర్తి చేసేందుకు కృషి చేయాలని, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తూ పంట పెట్టుబడి కోసం పంట రుణాలు బ్యాంకుల నుంచి మాత్రమే తీసుకునేలా చూడాలని అన్నారు. రైతు రుణ మాఫీ సంబంధించి 54 ఖాతాలలో సోమ్ము జమ జరిగినా రైతులకు అందించ డంలో ఆలస్యం వల్ల రుణమాఫీ కాలేదని, ఆ నిధులు రిటర్న్ వెళ్ళాయని అన్నారు. దీని పై పూర్తి స్థాయిలో నివేదిక అందించాలని, ప్రభుత్వ ఉన్నతాధికారులతో చర్చించి ఆ నిధులు మళ్ళీ వచ్చేలా చేయాలని అన్నారు. ఆధార్ తప్పులు, ఇతర సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ జరగని ఖాతాల సమస్యలు పరిష్కరించి సదరు రైతులకు కూడా రుణమాఫీ అందేలా చూడాలని అన్నారు. వ్యవసాయ టర్మ్ రుణాల పంపిణీ కు నిర్దేశించిన లక్ష్యంలో 79% చేరుకున్నాం అని, ఇదే దిశగా మిగిలిన లక్ష్యం సైతం పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకర్లు తోడ్పాటు అందించా లని అన్నారు. ఎం.ఎస్.ఎం.ఈ లకు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1164 కోట్ల రుణాల పంపిణీ లక్ష్యం కాగా 650 కోట్ల రుణం పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ప్రతి బ్యాంకు బ్రాంచీ నుంచి కనీసం 5 వ్యాపార యూనిట్ల గ్రౌండింగ్ కు చర్యలు చేపట్టాలని, అర్హులైన యువతకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జనవరి 27 నాటికి 4 వేల 559 స్వశక్తి సంఘాలకు 386 కోట్ల 99 లక్షలు, మెప్మా కింద 411 సంఘాలకు 49 కోట్ల 34 లక్షల బ్యాంకు రుణాలు అందించా మని అధికారులు తెలిపారు. స్వశక్తి సంఘాలకు నిర్దేశించు కున్న లక్ష్యంలో 80 శాతం మాత్రమే పూర్తి కావడానికి గల కారణాలను కలెక్టర్ ఆరా తీశారు. మహిళా సంఘాల రుణాలలో ఎన్.పి.ఏ ప్రస్తుతం 1.34 శాతం ఉందని దీనిని మరింత తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు వివిధ పథకాల క్రింద యువతకు రుణాలు అందించాలని, స్టాండ్ అప్ ఇండియా క్రింద డిసెంబర్ చివరి నాటికి 20 యూనిట్లకు 3 కోట్ల 62 లక్షల, ముద్రా రుణాల కింద 20 వేల 417 మంది లబ్ధిదారులకు 156 కోట్ల 94 లక్షల రుణాలు అందించామని తెలిపారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద ప్రస్తుత సంవత్సరంలో మూడు కోట్ల 32 లక్షల విలువగల 64 యూనిట్లను గ్రౌండ్ చేయడం జరిగిందని తెలిపారు. యువతకు ఉపాధి అందించే విషయంలో అధికారులు చొరవ చూపాలని , ఈ పథకాల పై విస్తృతంగా ప్రచారం కల్పించాలని కలెక్టర్ బ్యాంకర్లకు సూచించారు.

పి.ఎం.ఎఫ్.ఎం.ఈ ను వినియోగిస్తూ ఇందిరా మహిళా శక్తి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, ప్రస్తుతం పెండింగ్ లో ఉన్న 28 డి.పి.ఆర్ లను పరిశీలించి అర్హులైన యూనిట్ల గ్రౌండింగ్ చేయాలని, బ్యాంకు మేనేజర్ వద్ద పెండింగ్లో ఉన్న దరఖాస్తుల పై వెంటనే నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధానమంత్రి స్వానిధి క్రింద జిల్లాలోని 3 మున్సిపాలిటీలు, రామగుం డం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వీధి వ్యాపారులకు రుణాలు అందించాలని, రెండవ సారి తీసుకున్న రుణాలు చెల్లించిన ప్రతి వ్యాపారికి మూడవ సారి 50 వేల వరకు రుణం మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. పశుసంవర్ధక శాఖ ద్వారా జిల్లాలో 45 మరి అర్హులకు 91 లక్షల రుణం పంపిణీ చేశామని, మత్స్య శాఖ ద్వారా 81 మందికి 2 కోట్ల 54 లక్షల రుణ పంపిణీ జరిగిందని అన్నారు. వ్యవసా య మార్కెటింగ్ ఇన్ ఫ్రా, ఎఫ్.పి.ఓ , పశుసంవర్ధక వసతుల కల్పన క్రింద కేంద్ర ప్రభుత్వం నాబార్డ్ ద్వారా అమలు చేసే సబ్సిడీ పథకాలపై అవగాహన కల్పిస్తూ అవసరమైన వారు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ 2025-26 సంవత్సరానికి సంబంధించి వార్షిక ప్రణాళిక బుక్ లెట్ ను ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్ , వివిధ శాఖల బ్యాంక్ మేనేజర్ లు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్య, ఆరోగ్యంపై ప్రజా ప్రభుత్వం దృష్టి



**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో విద్య, ఆరోగ్య రంగాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది.. ఈ రంగాల అభివృద్ధి కోసం ఎన్ని నిధులైన కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శు క్రవారం ఆయన బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాల వార్షిక దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

విద్య పై పెట్టుబడి మూలంగా గొప్ప మానవ వనరులు రాష్ట్రంలో అభివృద్ధి చెందుతాయి ఫలితంగా ప్రపంచాన్ని ఏలే శక్తి తెలంగాణ కు దక్కుతుందని ఆయన అన్నారు. విద్యా రంగ అభివృద్ధి కోసం ప్రపంచ స్థాయిలో పోటీపడే విధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఒక్కో పాఠశాలను 200 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్నామని ఇప్పటికే 60 స్కూళ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశామని తెలిపారు. మహిళలకు విద్యను అందిస్తే ఆ ఫలితం కేవలం ఆమెకే కాకుండా కుటుంబానికి.. సమాజానికి మేలు జరుగుతుందని వివరించారు. కుటుంబ వ్యవస్థ దేశానికి బలం.. ఆ కుటుంబ వ్యవస్థను నడిపించే శక్తి అమ్మ, భార్య, సోదరీ రూపంలో ఉన్న మహిళ అని అభివర్ణించారు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని మహిళల అభివృద్ధికి అన్ని విధాల రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. మహిళలకు ప్రత్యేకంగా బడ్జెట్లో నిధులు కేటాయిస్తున్నామని వివరిం చారు, వారికి చదువు, ఉద్యోగ అవకాశాలు మెం డుగా లభించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. మహాలక్ష్మి పేరిట ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితం గా ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని.. విద్యార్థినీలు కళాశాలలకు వెళ్లేందుకు, మహిళలు ఉచి తంగా పని ప్రదేశాలకు వెళ్లేందుకు ఈ పథకం ఉపయోగపడు తుందని.. వీటితో రాష్ట్ర ప్రభుత్వం ఆగిపోదని తెలిపారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న ఆలోచనలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలతో 1,000 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ఉత్పత్తికి కార్యాచరణ ప్రారంభించామని తెలిపారు. సహజంగా వీటిని కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తారు అందుకు భిన్నంగా మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ఇందిరమ్మ ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు సోలార్ విద్యుత్ ప్లాంట్లు కేటాయిస్తుందని తెలిపారు. సోలార్ విద్యుత్ లో పెట్టుబడుల కోసం బ్యాంక్ లింకేజీ ఇప్పించడం, మహిళా సంఘాలు ఉత్పత్తి చేసిన విద్యుత్తును ప్రభుత్వమే కొనుగోలు చేయడం మహిళలకు ఎలాంటి ఒత్తిడి లేకుండా ఈ తరహా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పథకం దేశంలోనే గొప్ప పథకంగా అభివర్ణించారు.రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దబోతున్నామని వివరించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రతి సంవత్సరం 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామని, వారి తరఫున వడ్డీని ఆర్థిక శాఖ చెల్లిస్తుందని వివరించారు. ప్రపంచంలోనే పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ కు ప్రధానిగా బాధ్యతలు నిర్వహించిన ఇందిరాగాంధీ మహిళలు ఏ పనినైనా చేయగలరని నిరూపించారని తెలిపారు. 1959లో 15 మంది విద్యార్థినీలతో ప్రారంభమైన సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల ప్రస్తుతం 3000 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం అభినందనీయమని, ఈ కళాశాలలో చదివిన విద్యార్థినిలు గొప్ప ప్రతిభను కనబరుస్తున్నారని అభినందించారు.